

మౌనికకు అభినందన

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కన్నాపూర్‌కు చెందిన సిడాం మౌనికను ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి బుధవారం అభినందించారు. ఇటీవల రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీలో మౌనిక ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించింది.



‘ఆర్జీయూకేటీతో కలిసి పనిచేస్తాం’

బాసర ఆర్జీయూకేటీతో కలిసి పని చేయడానికి సిద్ధమని ఇంటర్నేషనల్ మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, కొరియా ప్రెసిడెంట్ డాక్టర్ జాయ్‌హాంగ్ కిమ్ పేర్కొన్నారు. త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటామని తెలిపారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రి వేళలో చలి ప్రభావం కొంతమేర తగ్గనుంది.

న్యూస్‌రీల్

కంటి వెలుగు విజయవంతం చేయాలి

కైలాస్‌నగర్: నేటి నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అన్నివర్గాల ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రకటనలో తెలిపారు. వంద రోజుల పాటు జరిగే రెండో విడత కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వారి పరిధిలోని కేంద్రాల్లో గురువారం ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా మండల, వార్డుల ప్రత్యేక అధికారులు ఆయా కేంద్రాల్లో హాజరై ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో దృష్టి లోపం కలిగిన వారికి పరీక్షలు నిర్వహించేందుకు 33 బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెండు బఫర్ టీమ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే సమయంలో ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఇప్పటికే అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని, స్థానిక మండల, గ్రామ అధికారుల నేతృత్వంలో కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు పలు ఆదేశాలు, సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కంటి వెలుగు కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతానికి సహకరించాలని కోరారు.

21న హెల్త్ ప్రొవైడర్ ఉద్యోగాలకు కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్: వైద్యారోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎం విభాగంలో మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) ఉద్యోగాల కోసం ఈనెల 21న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో ప్రకటనలో తెలిపారు. ఇటీవల తొమ్మిది పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈమేరకు తుది జాబితా విడుదల చేసినట్లు వివరించారు. 1:3 రోస్టర్ ప్రకారం ఎంపికైన అభ్యర్థులు ఉదయం 11 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఆదివాసీ సెమినార్‌లో సుశీల



మాట్లాడుతున్న ఆత్రం సుశీల

బోథ్: హైదరాబాద్‌లో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఆదివాసీ, గిరిజన సెమినార్‌లో బోథ్ మండలం బాబెర గ్రామానికి చెందిన ఆత్రం సుశీల పాల్గొన్నారు. ‘ఆదివాసీ, గిరిజన తెగల ఉపాధి అవకాశాలు అంశం’పై నిర్వహించిన సెమినార్‌లో గతంలో ‘స్వచ్ఛ’ అవార్డు పొందిన ఈమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సెమినార్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆదివాసీ, గిరిజన సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా జైలుకు 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు ఆహార వస్తువులు, వివిధ రకాల స్టీల్ ఫర్నిచర్ సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ ప్రకటనలో తెలిపారు. పప్పుదినుసులు, గోధుమలు, విజయ సన్‌ఫ్లవర్ ఆయిల్, రెడ్ లేబుల్ టీ పౌడర్, ఇతర వస్తువులు, స్టీల్‌ఫర్నిచర్ తయారీ చేసేందుకు, ముడి వస్తువులు సరఫరాకు టెండర్లు పిలుస్తున్నామని పేర్కొన్నారు. టెండర్ షెడ్యూల్‌తోపాటు ఫారాలను ఈనెల 17 నుంచి జిల్లా జైలులో పొందవచ్చని, ఫిబ్రవరి 3న టెండర్లు తెరవనున్నట్లు వివరించారు. ఆహార, ఇతర వస్తువులకు టెండర్ ఫారంధర రూ.28, వివిధ వస్తువుల తయారీ టెండర్‌ఫారం ధర రూ.110 ఉందని తెలిపారు. వివరాలకు 8186025615 లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

సీసీఐ ఆస్తులు స్వాహా!



తవ్వకాలతో కనుమరుగవుతున్న లైమ్‌స్టోన్ నిల్వలు

- పరాధీనమవుతున్న రూ.కోట్ల విలువైన స్థలాలు
- మట్టిలో కలిసిపోతున్న లైమ్‌స్టోన్ నిల్వలు
- ప్రేక్షకపాత్రకే అధికారులు పరిమితం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమకు సంబంధించిన విలువైన ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమ పునరుద్ధరణపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని కొంతమంది అక్రమార్కులు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. పరిశ్రమ కోసం గతంలో సేకరించిన కోట్లాది రూపాయల విలువైన లీజు స్థలాలను దొడ్డిదారిన హస్తగతం చేసుకుంటున్నారు. వీరికి కొంతమంది రాజకీయ నాయకులు అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. స్థలాల కబ్జాతో పాటు పక్కనే గుట్టలుగా ఉన్న సిమెంట్ ఉత్పత్తికి ఉపయోగపడే లైమ్‌స్టోన్ (సున్నపురాయి) నిల్వలను పొక్లెయిన్లతో తవ్వేస్తూ మట్టిలో కలిపేస్తున్నారు. వాటిని కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు వంత పాడుతున్నట్లుగా సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

కబ్జాకు గురవుతున్న స్థలాలు

సీసీఐ పరిశ్రమ ఆధీనంలో 2వేల ఎకరాల స్థలాలు ఉండగా ఇందులో 800 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. మరో 1200 ఎకరాల లీజు భూములున్నాయి. సీసీఐ పరిశ్రమ మూతపడటం, దాన్ని కూల్చేస్తామంటూ కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వృథాగా ఉన్న సీసీఐ భూములపై కొంతమంది రియల్ వ్యాపారు ల కన్ను పడింది. లీజు స్థలాల సాకు చూపుతూ కొంతమంది భూములను ఆక్రమిస్తుండగా, రాజకీయ పలుకుబడి కలిగిన మరికొంతమంది నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి వాటిని సొంతం చేసుకుంటున్నారు. అక్రమంగా స్వాధీనం చేసుకున్న సీసీఐ భూముల్లో లేఅవుట్లు, వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ప్లాటును రూ.20లక్షల నుంచి రూ.30లక్షల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పలు భూములు అక్రమార్కుల పరం కాగా, దీన్ని అడ్డుకునేవారు లేకపోవడంతో మిగతా భూములను సైతం సొంతం చేసుకునేదిశగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తోంది. ఫ్యాక్టరీకి సంబంధించిన లీజు స్థలాలు ఎన్ని.. ఎంత కబ్జాకు గురైంది.. ఇంకా ఎన్ని ఎకరాల భూములు ఉన్నాయనే వివరాలు సంబంధిత అధికారుల వద్ద అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. లీజు గడువు ఇంకా ముగియలేదని చెబుతున్న సీసీఐ అధికారులు వాటికి ఎన్‌ఓలను ఎలా జారీ చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని సీసీఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టిలో కలిసిపోతున్న లైమ్‌స్టోన్

సిమెంట్ ఉత్పత్తికి ఉపయోగపడే లైమ్‌స్టోన్‌ను ఫ్యాక్టరీని ఆనుకుని నిల్వ చేశారు. నిషాన్‌ఘాట్ శివారులో ఇవి గుట్టలుగుట్టలుగా నిండి ఉన్నాయి. వాటి పక్కనే సీసీఐ లీజు స్థలాలు ఉండటంతో వాటిని సొంతం చేసుకున్న రియల్ వ్యాపారులు గుట్టలుగా ఉన్న లైమ్‌స్టోన్‌ను తవ్వేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీల సాయంతో తవ్వేస్తూ నేలను చదునుచేస్తున్నారు. లైమ్‌స్టోన్ ఏర్పడకుండా ఉండేలా టిప్పర్ల ద్వారా చెరువు మట్టిని తెప్పించి వాటిపై కప్పేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సీసీఐ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవడం అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ అండదండలు ఉండటంతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ తవ్వకాలను ఆపాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, ఆదిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సున్నపురాయి నిల్వలను తవ్వేసి వాటిపై మట్టిని కప్పేస్తున్నారిలా..

‘సాక్షి’ కథనంపై కదలిక

- పోలీసులను ఆశ్రయించిన సీసీఐ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి

జిల్లా కేంద్రంలోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమకు సంబంధించి లైమ్‌స్టోన్ నిల్వ ఉంచిన ప్రాంతాన్ని జేసీబీ, టిప్పర్ల సాయంతో తవ్వకాలు చేపడుతూ భూమిని కబ్జా చేస్తున్న వైనంపై ‘సాక్షి’లో ‘భూంఫట్’ శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి కదలిక వచ్చింది. సీసీఐ ఎగ్జిక్యూటివ్ ఇన్‌చార్జి ఆర్‌కే గుప్తా బుధవారం ఆదిలాబాద్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. సీసీఐకి సంబంధించిన స్థలంలో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని ఆపి స్థలాన్ని పరిరక్షించేలా చూడాలని సీఐ, ఎస్సైలను కోరారు. అయితే సీసీఐ లీజు స్థలాలకు సంబంధించి డాక్యుమెంట్స్‌తో సహా వివరాలు అందజేస్తే తాము చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పడంతో పూర్తి ఆధారాలతో సహా గురువారం ఫిర్యాదు చేస్తానని గుప్తా వెల్లడించారు.

ఆ హడావుడి ఏది..?

సీసీఐ పరిశ్రమను తెరిపించాలనే డిమాండ్‌తో గతంలో అధికార బీఆర్‌ఎస్‌తో పాటు విపక్షాలకు చెందిన పలువురు నేతలు సీసీఐ సాధన సమితిగా ఏర్పడి కొద్ది రోజుల పాటు నిరసనలతో హడావుడి చేశారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయమంటూ ఆందోళన బాట పట్టారు. కాగా అదే ఫ్యాక్టరీని పూర్తిగా తొలగించాలనే ఆదేశాలు రాగా, ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నా ఆ సమితి నాయకులు మౌనం పాటించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాకేం సంబంధం లేదు



సీసీఐ లైమ్‌స్టోన్ నిలవ్వలు తవ్వుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. అయితే వాటితో నాకేం సంబంధం లేదు. దాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత సీసీఐ అధికారులపైనే ఉంటుంది. తవ్వకాలు జరుపుతున్న వారిపై పోలీస్‌స్టేషన్‌లో సీసీఐ అధికారులు కేసు పెట్టినట్లుగా తెలిసింది.

– రవిశంకర్, మైనింగ్ ఏడీ

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



సీసీఐ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. వారు పట్టించుకోకపోవడంతోనే స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నట్లు తెలుస్తోంది. లైమ్‌స్టోన్ తవ్వకాలు జరుగుతున్నట్లు ఇప్పటివరకైతే నా దృష్టికి రాలేదు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. విషయాన్ని సీసీఐ కేంద్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– సోయం బాపూరావు, ఎంపీ

గురువులే గొప్ప మార్గదర్శకులు

- ఎంపీ సోయం బాపూరావ్



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

అదిలాబాద్: గురువులే గొప్ప మార్గదర్శకులని ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రంలో బుధవారం నిర్వహించిన స్మృతి దివస్‌లో ఆయన పాల్గొన్నారు. బ్రహ్మ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తన జీవితంలో ఓ గురువు చేసిన బోధనల కారణంగానే తాను ఈ స్థాయికి చేరుకున్నట్లు వెల్లడించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. బ్రహ్మ బాబా దాదాపుగా 150 వరకు ఓం శాంతి కేంద్రాలను స్థాపించి ఎంతోమందిని ప్రభావితం చేశారని కొనియాడారు. ఆయన చూపిన మార్గం అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకురాలు రేవతి బెహెన్, బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్ రెడ్డి, బండారి దేవన్న తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణపై కేంద్ర పెద్దలను ఒప్పించండి’



సుహాసినిరెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

కైలాస్‌నగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా కేంద్ర బీజేపీ పెద్దలను ఒప్పించి మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్ కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకురాలు సుహాసినిరెడ్డిని బుధవారం ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 28 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నామన్నారు. వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే విధంగా ప్రధానమంత్రి, హోం శాఖ మంత్రిలను ఒప్పించి మాదిగల చిరకాల కోరిక నెరవేర్చాలని కోరారు. ఇందులో సుభాష్, నవీన్, చందు, శ్రీహరి, జైపాల్, గంగయ్య, శ్రీను, స్వామి, గణేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

‘నాగోబా’ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



కమిటీ చైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆలయ ఈవో రాజమౌళి

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చైర్మన్‌గా మెస్రం తుకారాంతో పాటు కమిటీ సభ్యులుగా హనుమంత్‌రావ్, నాగోరావ్, పోల్లు, భీంరావ్, చైతన్యతో ఈవో రాజమౌళి ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మెస్రం వంశీయులు బాదీరావ్, కోసేరావ్, వంశపెద్దలు తదితరులున్నారు.

స్వామివారి సన్నిధిలో డీటీసీ



కుటుంబ సమేతంగా డీటీసీ శ్రీనివాస్

జైనథ్: ఆదిలాబాద్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ కుటుంబ సమేతంగా మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. బుధవారం జైనథ్‌కు వచ్చిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు, అర్చన గావించారు. కాగా ఆలయ విశిష్టత, ప్రాశస్త్యాన్ని గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పూంద్రు వెంకట్‌రెడ్డి, డీటీ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కంటి వెలుగు

- జిల్లాలో 33 కేంద్రాలు
- 18 ఏళ్లు పైబడిన వారికి స్క్రీనింగ్
- వంద రోజుల పాటు కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్యఆరోగ్య శాఖ

జిల్లాలో మొదటి విడత కంటి వెలుగు వివరాలు..	
కంటి పరీక్షలు	3,49,373
రీడింగ్ గ్లాస్‌ల పంపిణీ	54,379
ప్రిస్క్రిప్షన్ (దూరపు చూపు)గ్లాస్‌లు	27,464
కంటి శస్త్రచికిత్స కోసం రెఫర్ చేసింది	36,472



ట్రయల్‌రన్‌లో భాగంగా ఇటీవల స్క్రీనింగ్ పనితీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: సర్వేంద్రియానాం నయనం ప్రధానం. అయితే రాష్ట్రంలో చాలామంది చూపు సమస్యతో బాధపడుతుండడంతో తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి గతంలోనే శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. 2018లో తొలివిడత చేపట్టగా, రెండో విడతను ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ఖమ్మంలో ప్రారంభించారు. జిల్లాలో నేటి నుంచి షురూ కానుంది. ఇప్పటికే వైద్యారోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమం వంద రోజుల పాటు కొనసాగనుంది. 18 ఏళ్ల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించనున్నారు.

నేటి నుంచి షురూ..

కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో నేటి నుంచి షురూ కానుంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు వైటీసీలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇదివరకే ఆయా మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గతంలో మొదటి విడతను 2018 ఆగస్టు 15న చేపట్టారు. ఫిబ్రవరిలో కార్యక్రమం నిలిచిపోయింది. జిల్లాలో 36,472 మందికి కంటి శస్త్ర చికిత్స కోసం రిఫర్ చేసినా ఇంతవరకు ఏ ఒక్కరికీ ఆపరేషన్ జరగలేదు. ప్రస్తుతం స్క్రీనింగ్ మాత్రమే చేపడుతున్నట్లు సమాచారం. ఈసారి కూడా ఆపరేషన్లు జరుగుతాయో, లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బృందంలో ఉండేది వీరే..

రెండో విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 33 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో 8 మందిని నియమించారు. మెడికల్ ఆఫీసర్, ఆప్తామెట్రిస్ట్, డాటాఎంట్రీ ఆపరేటర్, ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్, ముగ్గురు ఆశ కార్యకర్తలు ఉంటారు. వీరితో పాటు బఫర్ బృందాలను సైతం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అత్యవసరం ఉంటే వారిని కేటాయిస్తారు. 22 పీహెచ్‌సీలు, 5 పట్టణ ఆరోగ్యకేంద్రాల పరిధిలో నిర్దేశించిన ప్రకారం గ్రామాలు, కాలనీల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసరం ఉన్నవారికి అద్దాలు, మందులను అందజేస్తారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

33 కేంద్రాలు ఏర్పాటు..

కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొత్తం 33 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలో ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 27 బృందాల ద్వారా కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధిలోని 49 వార్డులతో పాటు జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని 468 గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమం కొనసాగనుంది. వంద రోజుల పాటు కార్యక్రమాన్ని చేపడతారు. ప్రభుత్వ సెలవు రోజులు మినహా మిగతా రోజుల్లో నిర్వహిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

రెండో విడత కంటి వెలుగుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ కార్యక్రమం వంద రోజుల పాటు ఉంటుంది. సెలవు రోజులు, శని, ఆదివారం మినహా మిగతా రోజుల్లో కొనసాగుతుంది. జిల్లాలోని 33 కేంద్రాల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని నేడు ప్రారంభిస్తారు. వైద్య పరికరాలు, మందులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో





ఆక్టోపస్ మాక్‌డ్రిల్

జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్ట్ వద్ద ఆక్టోపస్ బలగాల బృందం బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. ఈ బృందం జిల్లాకు రెండు రోజుల శిక్షణ నిమిత్తం వచ్చినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. దేశద్రోహులు, టెర్రరిస్టులు ప్రాజెక్టులను స్వాధీనపర్చుకుంటే నివారించాల్సిన అంశంపై డీఎస్పీ ఎం.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ చేపట్టారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, జైనథ్ సీఐ కె.నరేశ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.వంశీకృష్ణ, ఎస్సై బి.పెర్సస్ తదితరులు పాల్గొన్నారు.

– జైనథ్

మర్రిచెట్టు బాటలో ‘పటేల్’



ఇంద్రవెల్లి: నాగోబా జాతర నేపథ్యంలో పటేల్ కితకు చెందిన మెస్రం వంశీయులు బుధవారం రాత్రి సంప్రదాయ వాయిద్యాల నడుమ నైవేద్యాలతో కేస్లాపూర్‌లోని మర్రి చెట్టు వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

8లో▸

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదానికి గురైన ఆవుకు చికిత్స



ఆవుకు చికిత్స చేస్తున్న వైద్యాధికారులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో గాయపడ్డ ఆవుకు ఎమ్మెల్యే డ్రైవర్ కన్నయ్యతో పాటు పలువురు యువకులు సపర్యాలు చేసి చికిత్స అందించారు. ఆవు ప్రమాదానికి గురైన సమయంలో అక్కడే ఉన్న కన్నయ్య స్థానిక వైద్యాధికారులకు సమాచారం అందించి చికిత్స చేయించారు. ఆవుకు చికిత్స చేయించిన యువకులను స్థానికులు అభినందించారు.

జీతం ఇవ్వలేదని ఆత్మహత్య



వెంకటరమణ (ఫైల్)

బాసర(ముధోల్): రెండేళ్లుగా చేసిన పనికి జీతం ఇవ్వడం లేదని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు బాసర విశ్వబ్రాహ్మణ సత్రం మేనేజర్ వెంకటరమణ. పోలీసుల వివరాల ప్రకారం... బాసర ఆలయం పక్కనే ఉన్న విశ్వబ్రాహ్మణ సత్రంలో కొన్నేళ్లుగా మేనేజర్‌గా నిర్మల్ జిల్లా మమడ గ్రామానికి చెందిన వెంకటరమణ(45) పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా తనకు రావాల్సిన వేతనం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం పనిచేస్తున్న సత్రంలోని గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి



ధర్మాజీ భోజన్న(ఫైల్)

లోకేశ్వరం: ఆటో బోల్తా పడి ఒకరు మృతిచెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన ధర్మాజీ భోజన్న(45) అదే గ్రామానికి చెందిన నిమ్మ సాయికుమార్‌కు చెందిన ఆటోలో మండలంలోని పిప్రి గ్రామంలో ఇనుప బీరువ ఇచ్చేందుకు మంగళవారం రాత్రి బయలుదేరారు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో సాయిమార్ ఆటోను అతివేగంగా నడపడంతో రాయాపూర్ కాండ్లీ గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భోజన్న సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య నర్సవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ బుధవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాజన్న మృతదేహం

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై భరత్ సుమన్ వివరాల ప్రకారం... ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామానికి చెందిన మూతి రాజన్న(26) కూలీ కోసం ట్రాక్టర్‌పై పనికి వెళ్తుండేవాడు. పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై వస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఎగిరిపడ్డాడు. దీంతో రాజన్న తలకు తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు బుధవారం పరామర్శించారు.



మర్రిచెట్టు వద్దకు వెళ్తున్న మెస్రం వంశీయులు

మర్రిచెట్టు వద్ద 'మెస్రం'ల బస

- వంశస్థులంతా కేస్లాపూర్‌కు చేరిక
- పటేల్ కిత వారికి ఘన స్వాగతం
- నేటి రాత్రి తూమ్ పూజలు



మర్రిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మెస్రం పెద్దలు



మర్రిచెట్టు వద్ద బసచేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా జాతర నేపథ్యంలో గంగాజల సేకరణ యాత్ర చేపట్టిన మెస్రం వంశీయులు కేస్లాపూర్ సమీపంలోని మర్రిచెట్టు వద్దకు ఇప్పటికే చేరుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే కితల వారీగా చేరుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. పటేల్ కితకు చెందిన వారు బుధవారం రాత్రి చేరుకోగా వారికి సంప్రదాయ వాయిద్యాల మధ్య ఘనస్వాగతం పలికారు. వీరంతా ఈనెల 20 వరకు ఇక్కడే బస చేయన్నారు. రాత్రి ప్రధాన్ సమాజ్ పెద్ద ఆధ్వర్యంలో వంశీయులకు నాగోబా చరిత్ర బోధించారు. మెస్రం వంశంలో మృతి చెందిన పెద్దల పేర్లతో నేటి రాత్రి తూమ్(కర్మఖాండ)పూజలు చేపట్టనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ నెల 21న ఆలయానికి చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. అదే రోజు రాత్రి పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించి మహాపూజ అనంతరం జాతర ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు చిన్ను పటేల్, బాదీరావ్, కోసేరావ్ కటోడ, హనుమంత్‌రావ్, దాదారావ్, తిరుపతి, వంశీయులున్నారు.

కులదేవతకు మెస్రం వంశీయుల పూజలు



శోభాయాత్రలో మెస్రం వంశీయులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి-కే గ్రామంలో మెస్రం వంశీయులు బుధవారం కులదేవతకు శోభాయాత్ర నిర్వహించారు. సంప్రదాయ డప్పులు, వాయిద్యాలతో భజనలు, కీర్తనలతో ఇంటింటికి తిరుగుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు భీమల్‌పెన్ పూజల కోసం లోకారి-కే నుంచి పెండల్‌వాడ వెళ్లి గంగాస్నానాన్ని ఆచరించారు. మూడు రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక పూజల అనంతరం భద్రపరుస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ భీంరావు, దేవారిలు, కటోడాలు, పూజారులు ఉన్నారు.

లంబాడాల ఎస్టీ హోదాను రద్దు చేయాలి



కోర్టుకు హాజరైన తుడుందెబ్బ నాయకులు

బోథ్: లంబాడాలకు చట్టబద్ధతలేని ఎస్టీ హోదాను రద్దు చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. గతంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొనసాగిన ఉద్యమంలో భాగంగా పోలీసులు పెట్టిన కేసుల్లో భాగంగా నాయకులు బుధవారం బోథ్‌లోని సివిల్ కోర్టుకు హాజరయ్యారు. లంబాడాల ఎస్టీ హోదాను రద్దు చేసేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కోర్టుకు హాజరైన వారిలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, జిల్లా అధ్యక్షులు గొడం గణేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుడాల స్వామి, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, ఐటిడిఏ డైరెక్టర్ మేస్రం భూమన్న ఉన్నారు.

గడపగడపకూ వైఎస్సార్ పాలన

- వైఎస్సార్ టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనిల్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అనిల్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: గడప గడపకు వైఎస్ఆర్ పాలనపై వివరిస్తామని వైఎస్ఆర్ టీపీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జెండా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. బూత్‌స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాహుల్, మైనార్టీ విభాగం నాయకులు షేక్ మోయిన్, పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లం, నాయకులు కృష్ణమీనన్ యాదవ్, రాష్ట్ర గిరిజన విభాగం సభ్యుడు మెస్రం శంకర్, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో బాలిక మృతి



రాజేశ్వరి(ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన కొంకటి రాజేశ్వరి(13) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. బాలిక తండ్రి రాజమల్లు సైతం గత పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. రాజేశ్వరికి సోదరి సోని, తల్లి ముత్తవ్వ ఉన్నారు. చిన్న వయసులోనే క్యాన్సర్ బారినపడి బాలిక మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

తృటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన కంటెయినర్

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని మండల కార్యాలయాల వైపు వెళ్లే సర్వీస్ రోడ్డుపై ఓ కంటెయినర్ అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... హైదరాబాద్ నుంచి ఘజియాబాద్ వెళ్తున్న ఓ కంటైనర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై 44పై ఎదురుగా వచ్చిన ఒక మేకను తప్పించే క్రమంలో ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న సర్వీసు రోడ్డు పైకి చేరింది. హైవే నుంచి సర్వీస్ రోడ్డుకు ఎత్తు ఉండడంతో ఒక్కసారిగా సర్వీసు రోడ్డుపై కూలిపోయింది. ఈ క్రమంలో ఓ ఇంటి ప్రహరీ వద్ద నిలిచిపోయింది. పాక్షికంగా ఇంటి గోడ దెబ్బ తినడంతో పాటు లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు. స్థానికులు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగే సమయానికి సర్వీస్ రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటామని మండల పోలీసులు తెలిపారు.

ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రకు చెందిన జాదవ్ ఉమేష్(48) రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలుకా మోహెద గ్రామానికి చెందిన జాదవ్ ఉమేష్ తన కూతురి పెళ్లి చేయడంతో అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చలేక మనస్తాపంతో తాగుడుకు బానిసయ్యాడు. ఈ నెల 14న ఇంట్లో పురుగుల మందు తాగగా కుటుంబీకులు చికిత్స నిమిత్తం మాండ్వి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంగళవారం రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్ తెలిపారు.

ఇంటి ముందు బైక్ చోరీ

నేరడిగొండ: ఇంటి ముందు నుంచి ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని వడూర్ రోడ్డుకు ఆనుకొని ఇంట్లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు ఎం.బాలకృష్ణ పల్సర్ బైక్ (టీఎస్ 01 ఈఎం 0972)ను రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

బంగారు తెలంగాణ పేరిట బాదుడు



సమావేశంలో మాట్లాడుతున్న చిట్యాల సుహాసినిరెడ్డి

- బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: బంగారు తెలంగాణ పేరిట బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలపై అధిక చార్జీలను బాదుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సమస్యలతో నిత్యం సతమతమవుతున్న పేదలపై విద్యుత్ చార్జీల అదనపు వసూళ్లకు దిగుతున్నారని మండిపడ్డారు. పేదలను దృష్టిలో ఉంచుకుని చార్జీలను తగ్గించాల్సింది పోయి రోజురోజుకు పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. బస్సు చార్జీలు, నల్లా బిల్లులను సైతం పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీంతో సామాన్యులు బిల్లులు కట్టలేక తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడంతోపాటు చీప్ లిక్కర్ రేట్లు సైతం పెంచుతున్నారని దుయ్యబట్టారు. ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణను మర్చిపోయి నిత్యం ఫోటోలో తీయడంలో నిమగ్నం అవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన తీరు మార్చుకొని పేదలపై భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గందే విజయ్ కుమార్, కొత్తపల్లి సంతోష్, గటిక క్రాంతి కుమార్ ఉన్నారు.

'ఆర్జీయూకేటీతో కలిసి పని చేయడానికి సిద్ధం'



జాయ్‌హొంగ్‌కిమ్ బృందంతో వెంకటరమణ

బాసర(ముధోల్): ఆర్జీయూకేటీ లాంటి ఉన్నత విద్యాసంస్థతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఇంటర్నేషనల్ మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్, కొరియా ప్రెసిడెంట్ డాక్టర్ జాయ్‌హొంగ్ కిమ్ పేర్కొన్నారు. త్వరలో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఆర్జీయూకేటీ క్యాంపు కార్యాలయంలో మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ కొరియా, హైదరాబాద్ శాఖ ప్రతినిధి బృందంతో బుధవారం బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. జూన్‌లో కొరియాలో జరిగే ఎడ్యుకేషన్ ఫెయిర్ సమావేశాలకు ఇన్‌చార్జి వీసీని ఆహ్వానించామని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. మైండ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ కొరియా సంస్థలతో ఒప్పంద అవగాహనతో అకాడమిక్, విద్యాపరమైన సహాయ సహకారాలు అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడితో అద్భుత ఫలితాలు సాధిస్తామని తెలిపారు. ఈ సమాచారాన్ని ఇన్‌చార్జి వీసీ ఓ పత్రిక ప్రకటనలో వెల్లడించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



మిషన్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఏజెన్సీ గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం కేబీ ప్రాంగణంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య, ఐటీడీఏ సహకారంతో పాల మిత్రలకు ఎలక్ట్రానిక్ మిల్క్ టెస్టర్‌ల వినియోగంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులు అభివృద్ధి సాధించేలా పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా 30 గిరిజన గ్రామాలను ఎంపిక చేసి ఆ గ్రామాల్లోని రైతులకు పాడి పశువులు కొనుగోలు చేసేలా రుణాలు అందిస్తామన్నారు. త్వరలో ఉట్నూర్ కేంద్రంగా పాల శీతలీకరణ కేంద్రం ప్రారంభం కానుందని, దీంతో పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయన్నారు. ఉట్నూర్ సమీపంలోని 20 గ్రామాల్లో పాలసేకరణ కేంద్రాలు స్థాపించి గ్రామ స్థాయిలో పాల నాణ్యత పరీక్షల కోసం రూ.8లక్షల విలువ గల 20 మల్క్ టెస్టర్లను పంపిణీ చేస్తామని చెప్పారు. పాల ఉత్పత్తుల పెంపు కోసం పాల మిత్రలకు గుజరాత్ రాష్ట్రంలో విజ్ఞాన యాత్రలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజయ డెయిరీ డీడీ మధుసూదన్, జేడీఎం నాగభూషణం, మేనేజర్ దస్రు, పంపిణీదారులు రమేశ్, అఖిల్, రమణారెడ్డి, అనిల్, రవి ఉన్నారు.

మగ్గంపై అమ్మవారి చీర..



మగ్గానికి పూజలు చేస్తున్న బాసర ఆలయ ఈవో విజయ రామారావు

నిర్మల్: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఈనెల 26న నిర్వహించే వసంత పంచమి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. వేడుకకు ముందుకు రోజు అమ్మవారికి అలంకరించే చీరను తొలిసారిగా బాసర ఆలయ ఆవరణలో భక్తులు మగ్గంపై నేస్తున్నారు. ఇందుకోసం ముందుగానే ఆలయ అధికారుల అనుమతి తీసుకున్న బాసర పద్మశాలి సంఘం సభ్యులు ఈనెల 25న అమ్మవారికి అలంకరించేందుకు 12 గజాల చీర నేతను బుధవారం ప్రారంభించారు. ఆలయ అతిథి గృహంలో ఈవో విజయరామారావు మగ్గానికి పూజలు చేసి ప్రారంభించారు. సరస్వతి అమ్మవారి పుట్టినిల్లుగా కొలిచే బాసలో అమ్మవారికి చీర నేయడం అదృష్టంగా భావిస్తున్నామని పద్మశాలీ సంఘం సభ్యులు తెలిపారు.

అటవీ అధికారుల కనుసన్నల్లోనే కలప తరలింపు

- జాతీయ రహదారిలో ట్రాక్టర్ ట్రాలీలో టేకు దుంగలు
- నిలదీసిన మండలవాసులు



ట్రాక్టర్ ట్రాలీలో టేకు దుంగలు

నేరడిగొండ: అటవీ శాఖ అధికారుల కనుసన్నల్లోనే కలప తరలిస్తున్నారనే మండల వాసులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్‌ఓ గణేశ్ ఆధ్వర్యంలో బోరిగాం శివారు అటవీ ప్రాంతంలో 19 కలప దుంగలు తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకోవడంతో పాటు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అయితే బుధవారం ఆ ప్రాంతం నుంచే మూడు ట్రాక్టర్లలో కలప దుంగలను అటవీశాఖ కార్యాలయం వైపు అధికారులు తరలించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా సాయంత్రం రోల్‌మామడ - కిష్టాపూర్ జాతీయ రహదారి మధ్యలో సుమారు 20 టేకు దుంగల లోడ్‌తో ఓ ట్రాక్టర్ ట్రాలీ కనిపించింది. దానికి ఇంజన్ లేకపోగా అటువైపుగా వెళ్తున్న మండలవాసులు గుర్తించి ఆరా తీయగా కలప టింబర్ డిపోకు తరలిస్తున్నామని అధికారులు తెలుపడం గమనార్హం. మరో రెండు ట్రాక్టర్లలో టేకు దుంగలను నల్లటి తాటిపత్రి కప్పి తీసుకెళ్లినట్లు పలువురు పేర్కొంటున్నారు. అటవీని సంరక్షించాల్సిన అధికా రులే ఇంటి దొంగలయ్యారని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రియుని ఇంటి ఎదుట దీక్ష



దీక్ష చేస్తున్న యువతి

భీమారం(చెన్నూర్): తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని మద్దికల్ గ్రామానికి చెందిన యువతి బుధవారం మండలంలోని సుంకరిపల్లి గ్రామానికి చెందిన జాడి అశోక్ ఇంటి ఎదుట దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా యువతి మాట్లాడుతూ కొంతకాలంగా తామిద్దరం ప్రేమించుకుంటున్నామన్నారు. విషయం తమ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఇంట్లో నుంచి గెంటివేశారని వాపోయింది. దీంతో సదరు యువకుడు కూడా తప్పించుకు తిరుగుతుండడంతో దీక్ష చేపట్టినట్లు ఆమె పేర్కొంది. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానంది. పోలీసులు చేరుకుని యువతితో మాట్లాడారు. వారి సూచన మేరకు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు యువకుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

డ్రోన్‌తో రసాయన మందుల పిచికారీ



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తాంసి: మారుతున్న కాలానికి వ్యవసాయానికి సాంకేతికతను జోడించడం ద్వారా రైతులు మేలైన ఫలితాలు పొందవచ్చని డ్రోన్ పైలెట్ దేవేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని జామిడి గ్రామంలో శనగ పంటపై సైబరాబాద్ ఏరోస్పేస్ సాంకేతిక బృందం సభ్యులు డ్రోన్ ద్వారా పురుగుల మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రోన్ పైలెట్ దేవేందర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా స్ప్రే చేయడంతో సమయం ఆదాతో పాటు కూలీల కొరతను అధిగమించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశవ్ రెడ్డి, సిబ్బంది ముఖీద్, అబ్దుల్ హక్, రైతులు సుభాష్‌రెడ్డి, అమర్, సర్వేష్ ఉన్నారు.

ద్విచక్ర వాహనాల బ్యాటరీలు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్ ప్రాంతంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించి మూడు బ్యాటరీలు చోరీకి గురైనట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భుక్తాపూర్ కాలనీకి చెందిన డోకావల్ నరేందర్ పనులు ముగించుకొని రాత్రి 10గంటల తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. తెల్లారి చూసే సరికి బైక్‌లో నుంచి బ్యాటరీ చోరీకి గురైనట్లు గమనించాడు. దీంతోపాటు ఆయన ఇంటి సమీపంలోని చుట్టుపక్కల వారికి సంబంధించి రెండు బైక్‌ల బ్యాటరీలు సైతం చోరీకి గురయ్యాయి. దీంతో బుధవారం బాధితులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.